సాక్షి
హైదరాబాద్। సోమవారం। 4। నవంబర్। 2024

సమగ్ర కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



సర్వే వివరాలను ప్రజలకు వివరిస్తున్న వెంకటేశ్

గౌలిపురా: సమగ్ర కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 6వ తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి చేపట్టబోయే సర్వేకు ప్రజలు, అన్ని పార్టీల నేతలు, కుల సంఘాలు వారు సహకరించాలన్నారు. ఆదివారం చార్మినార్ నియోజకవర్గంలోని లాల్‌దర్వాజా తదితర ప్రాంతాల్లో వెంకటేశ్ ఇంటింటికీ తిరిగి సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన నమునా ఫారాలను అందులో పొందుపరిచిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ వేడుకలు



గోల్కొండ: గ్యార్వీ వేడుకలను ఆదివారం గోల్కొండ, అహ్మద్‌నగర్, హకీంపేట్ తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఖాజా గరీబ్ నవాజ్ జెండాతో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఊరేగింపులో ఆబీద్, ఇలియాస్, మహ్మద్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం

- పది రోజుల పాటు జరగనున్న సర్వే..
- ఈ నెల 6న ప్రారంభం
- దిగ్విజయం చేయడానికి వరుసగా శిక్షణ శిబిరాలు
- అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు



శాంతినగర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో హాజరైన ఎస్‌హెచ్‌జీ సభ్యులు

సర్వే చేసే సిబ్బంది వివరాలు ఇలా...		
డివిజన్లు	-	07
ఎన్యుమరేటర్లు	-	603
బిఎల్ఓ సూపర్‌వైజర్లు	-	60
ఎస్‌హెచ్‌జీ సభ్యులు	-	170
ఆశావర్కర్లు	-	80
అంగన్‌వాడీ టీచర్లు	-	70

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఈ నెల 6న ప్రారంభమై పది రోజుల పాటు కొనసాగనుంది. ఈ సర్వేను విజయవంతం చేయడానికి ఎన్యుమరేటర్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతరత్రా సిబ్బంది రంగ ప్రవేశం చేస్తారు. ఇప్పటికే వీరికి రోజుకొక్కరితో జీహెచ్ఎంసీ అధికారులు శిక్షణా కార్యక్రమాలను చేపట్టారు. వీరు ప్రారంభం రోజున ఇంటింటికి వెళ్లి స్టిక్కర్‌ను అతికిస్తారు. అదే రోజున ఇంటి యజమాని పేరు, ఫోన్ నంబరును తీసుకుంటారు. సర్వేకు సిద్ధం చేసుకోవాల్సిన సమాచారాన్ని దగ్గర ఉంచుకోవాలని సూచిస్తారు. తర్వాత వచ్చి వివరాలను సేకరిస్తారు. నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి, రెడ్‌హిల్స్, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, అహ్మద్‌నగర్, విజయనగర్ కాలనీ డివిజన్లలో సర్వే చేయడం ప్రారంభిస్తారు.

ఎన్యుమరేటర్స్ ఇవ్వాల్సిన వివరాలు ఏమిటంటే..

- సాధారణ వివరాల కింద కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, సంబంధం, మతం, సామాజిక వర్గం, వయస్సు, మాతభాష, ఆధార్‌కార్డు నంబరు, మొబైల్ నంబరు, దివ్యాంగులైతే వైకల్యం, వైవాహిక స్థితి గురించి సర్వే సభ్యులకు చెప్పాల్సి ఉంటుంది.
- విద్యా వివరాల కింద పాఠశాలలో చేరిన నాటికి వయస్సు, విద్యార్హత, ఏ మాధ్యమంలో చదివారు, బడి మానేస్తే వివరాలు చెప్పాల్సి ఉంటుంది.
- ఉద్యోగ, ఉపాధి వివరాలకు సంబంధించి ప్రస్తుతం చేసే పని, వత్తి, ఉద్యోగ, ఉపాధి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.
- వార్షికాదాయం, ఒకవేళ వ్యాపారులైతే వార్షిక టర్నోవర్ చెప్పాలి.
- సంప్రదాయ కుల వృత్తులైతే ఆ వత్తి కొనసాగిస్తున్నారా? లేదా. వృత్తితో కలిగిన వ్యాధి(ఉంటేనే), ఆదాయ పన్ను చెల్లింపుదారులా? అవును/ కాదు, బ్యాంకు ఖాతా ఉంది.లేదు వంటి వివరాలు నమోదు చేసుకుంటారు.

56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు...

సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. ఇందు కోసం 56 ప్రధాన, మరో 19 అనుబంధ ప్రశ్నలకు (మొత్తం-75) పార్ట్-1, పార్ట్-2 కింద 8 పేజీల్లో సమాచారం సేకరిస్తారు. పార్ట్-1లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాల కింద సాధారణ, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలు, రాజకీయ, వలసల సమాచారం అడుగుతారు. పార్ట్-2 కింద కుటుంబ వివరాలను సేకరిస్తారు.

ఇవి దగ్గర ఉంచుకోండి..

- సర్వే కోసం మన ఇంటి వద్దకు వచ్చే ఎన్యుమరేటర్స్‌కు సమయం వృథా కాకుండా ఉండేందుకు, మనం ఇచ్చే సమాచారం సమగ్రంగా, తప్పులు దొర్లకుండా ఉండేందుకు ముందుగానే మనం దగ్గర ఉంచుకోవాల్సినవి కొన్ని ఉన్నాయి.
- వాటిలో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, వాహనాల ఆర్‌సీలు, పాన్ కార్డు, ధరణి పాస్ పుస్తకం(భూములు ఉంటే), స్థిరాస్తి, చరాస్తి వివరాలు దగ్గర ఉంచుకుంటే ఎన్యుమరేటర్లకు సర్వే సులువు అవుతుంది.

రిజర్వేషన్ ఫలాలు పొందారా?

- విద్య ఉద్యోగ పరంగా రిజర్వేషన్ విధానంతో ప్రయోజనం పొందినా, గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన పథకాల వివరాలు నమోదు చేస్తారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు పొందారా? డినోటిఫై చేయబడిన సంచార /పాక్షిక సంచార తెగకు చెందిన సమాచారాన్ని అవును/ కాదు రూపంలో సేకరిస్తారు.

రాజకీయ నేపథ్యం ఉందా...

- ప్రజాప్రతినిధిగా ప్రస్తుతం, పూర్వం ఏ పదవిలో ఉన్నారు. పదవీకాలం, నామినేటెడ్ వివరాలు నమోదు చేస్తారు.
- ఈ ప్రశ్నావళి ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారికే వర్తిస్తుంది.
- రిజర్వేషన్ ఫలాలతో పదవిని పొందారా.. లేక సాధారణ కేటగిరిలో గెలుపొందారా? అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది.

వలసలకు కారణం ఏమిటి?

- కుటుంబీకుల్లో ఎవరైనా ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలస వెళ్తే ఆ వివరాలను కూడా నమోదు చేస్తారు. వలస వెళ్లడానికి కారణంపై ఆరా తీస్తారు.
- ఎన్యుమరేటర్లు చేసే సర్వేలో కుటుంబీకుల ఫొటోలు తీయరు. ఎలాంటి పత్రాలు తీసుకోరు. అందరూ ఉండాల్సిన అవసరం లేదు. కుటుంబ యజమాని ఉంటే సరిపోతుంది. ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

ఆస్తులు, అప్పులు చెప్పాల్సిందే..

గత ఐదేళ్లలో తీసుకున్న రుణాలు. ఎందుకు తీసుకున్నారు. ఎక్కడి నుంచి పొందారు. ఏదైనా వ్యవసాయ అనుబంధ కార్యకాపాలాల్లో పాల్గొంటే ఆ వివరాలు తీసుకుంటారు. పశుసంపద సంఖ్యను సేకరిస్తారు. స్థిరాస్తి, చరాస్థి వివరాలతో పాటు రేషన్ కార్డు నంబరు(ఉంటే), నివాసగృహ విస్తీర్ణం (చదరపు గజాల్లో), నివాస రకం, గదుల సంఖ్య తాగునీటి వనరు, విద్యుత్ సదుపాయం, వంటకోసం వినియోగించే ఇంధనం వంటి వివరాలను సేకరిస్తారు.

తలసాని హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



తలసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆయన పూలబొకే అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వంతో పోరాటం చేసి పరిష్కరిస్తానన్నారు.

'సదర్ వేడుకలను ప్రభుత్వ పండుగగా ప్రకటించిన ఘనత రేవంత్ రెడ్డిదే'



అంజన్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న శంకర్‌లాల్ యాదవ్, వినోద్ యాదవ్

అబిడ్స్: సదర్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించడం అభినందనీయమని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితోనే యాదవుల సంక్షేమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పండుగగా సదర్ సమ్మేళనాన్ని ప్రకటించడంతో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన గ్రేటర్ యాదవ సంఘం నాయకులు శంకర్‌లాల్ యాదవ్, వినోద్ యాదవ్‌లు అంజన్‌కుమార్ యాదవ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యాదవ కులస్తుల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి రేయింబవళ్లు అందుబాటులో ఉంటానన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న 117 జంటలు


సుల్తాన్‌బజార్: కార్తీకమాసం సందర్భంగా కోఠి ఇస్లామియాబజార్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక రామసహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో 117 జంటలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్లామియాబజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమిరిశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడుతూ..లోక కల్యాణార్థం మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు ప్రతి యేటా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రవికుమార్, కోశాధికారి ఎర్రం లక్ష్మణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బోధనలకు నిలయం.. కమరేకి గుమ్మజ్

21వ తేదీ నుంచి ఉర్సు షరీఫ్ 372



విద్యుత్ దీపాలతో ముస్తాబైన దర్గా



జియాగూడ: ఆధ్యాత్మిక బోధనలకు, మానసిక ప్రశాంతతకు నిలయంగా పేరుగాంచింది జియాగూడ కమరేకి గుమ్మజ్. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన సయ్యద్ షా కుదా నుమా హుస్సేని అప్పటి సుల్తాన్ వద్ద సుమారు 12 ఏళ్లు సైనిక కమాండర్ పని చేశాడు. గురువు అమీనుద్దీన్ అలియాలా షేరేకుదా ఆదేశం మేరకు ప్రజలకు ఆధ్యాత్మిక బోధనలు చేయడానికి 1500వ సంవత్సరం దెక్కన్ రాష్ట్రం ప్రస్తుత హైదరాబాద్ వచ్చి జియాగూడలో ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసి 1503లో కమరేకి (ఖర్బుజా పండు) ఆకారంలో కట్టి దాన్ని నిర్మించి దాని పేరు కమరేకి గుమ్మజ్‌గా నామకరణం చేశాడు.

కుల మతాలకు అతీతంగా బోధనలు..

కుల మతాలకు అతీతంగా హుస్సేని 1503 నుంచి బోధనలు చేశాడు. ఆయన బోధనలు వినడానికి స్థానిక పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేవారు. ఆధ్యాత్మిక గురువుగా ప్రసిద్ధి చెందిన హుస్సేనికి స్థానిక పాలకుడు తన కుమార్తె కూల్సుంబిను వివాహం జరిపించి అల్లుడిగా చేసుకున్నాడు.

జియాగూడ దాటని మూసీ వరదలు..

1503లో మూసీ నదికి వరదలు వచ్చాయి. ఈ వరదల కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు ఆస్తినష్టం జరిగింది. దీంతో హుస్సేని జియాగూడ ప్రాంతం దాటి ముందుకు రావొద్దని గంగమ్మ తల్లిని వేడుకున్నాడు. ఈయన వేడుకోలుతో వరదలు జియాగూడ ప్రాంతం దాటి ముందుకు రాలేదు. ఈ సంఘటనతో స్థానికులు ఎంతో ఆదరించారు. ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ 1505లో పరమ పదించారు. హుస్సేని మృతదేహాన్ని గుమ్మజ్‌లోనే ఖననం చేసి అప్పటి నుంచి ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. చిన్న పిల్లలకు పాల పళ్లు వచ్చే సమయంలో దురద, విరేచనాలు అవుతుంటాయి. పిల్లలను గుమ్మజ్‌కు తీసువచ్చి ప్రార్థనలు చేసి విభూతి తీసుకొని పళ్ల వద్ద రాయడం మూలాన బాధలు తగ్గి సాఫీగా పళ్లు వస్తాయి. అలాగే కోరిన కోరికలు తీరిన వెంటనే 11 కోడి గుడ్లతో బిర్యానీ చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే గుమ్మజ్ పరిసరాల మట్టిని ఇళ్ల వద్ద చల్లితే పాములు రావని విశ్వాసం.

ఈ నెల 21 నుంచి ఉర్సు షరీఫ్ 372 వేడుకలు..

ఈ నెల 21, 22, 23వ తేదీలలో జియాగూడ కామరేకి గుమ్మజ్‌లో ఉర్సు షరీఫ్ 372 వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ముతావలి సయ్యద్ హాఫియుల్లా తెలిపారు. 21న సందల్, 22న చీరఘస్, 23న మజ్లిస్ ఈ కుల్ కార్యక్రమాలు ఉంటాయని పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని తెలిపారు.

కల్యాణం..కమనీయం

అబిడ్స్: గుడిమల్కాపూర్ మహేష్‌నగర్ కాలనీలో వేంకటేశ్వర స్వామి అళవేలు మంగ, పద్మావతి సమేత కల్యాణ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. శనివారం రాత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలు భాస్కరభట్ల రాహుల్ శర్మ వేద మంత్రాలతో నిర్వహించారు. అర్ధరాత్రి వేళ స్వామివారి పల్లకీ సేవా చేపట్టారు. కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 2 వేల మంది భక్తులు తరలి వచ్చారు. ఈ కల్యాణ వేడుకల్లో మహేష్‌నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పట్నం సుబ్బారావు, న్యాయవాది రాజశేఖర్, ముళ్లె రాకేష్, నర్సింహా గౌడ్, నవిన్ కుమార్, గొరిగె శ్రీనివాస్, శ్రీధర్, కిశోర్ గుప్తా, ప్రసాద్, ప్రమోద్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌లతో పాటు అసోసియేషన్ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, ఆల్ ఇండియా ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందంగుప్తా పాల్గొని పూజలు చేశారు.



వేంకటేశ్వర స్వామి కల్యాణ చేస్తున్న అర్చకులు

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తాను నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకోని ప్రజా దర్బార్‌ను వారానికి రెండు సార్లు నిర్వహిస్తున్నామన్నారు. అయితే ప్రజా దర్బార్‌కు వచ్చే ఫిర్యాదుదారులు అభివృద్ధి పనులపై ఫిర్యాదులు, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు తదితర విషయాలపైనే తమ తమ ఫిర్యాదులు అందించాలన్నారు. లంగర్‌హౌస్, నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్‌ల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను తీసుకోని వాటిని సంబంధిత అధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, అబీబ్‌చావూస్ తదితరులున్నారు.

హాకీ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలి



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 26న సబ్ జూనియర్ జాతీయ స్థాయి మహిళా హాకీ టోర్నమెంట్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎల్బీస్టేడియంలోని ఫతే మైదాన్ క్లబ్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీఆర్. బీమ్‌సింగ్, కోశాధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీలను బలోపేతం చేస్తాం



గోల్కొండ: నగరంలోని పీస్ అండ్ మైత్రి కమిటీలను మరింత బలోపేతం చేస్తామని హైదరాబాద్ నగర లాండ్ ఆర్డర్ అదనపు కమిషనర్, నగర పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ విక్రమ్‌సింగ్ మాన్ అన్నారు. గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, పోలీసులకు పీస్ కమిటీలు వారధిలా పని చేస్తున్నాయన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు మైత్రి కమిటీ సభ్యులు వెలకట్టలేని సేవలు అందిస్తున్నారన్నారు. ఆయనను కలిసిన వారిలో గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు ఆబీద్, ఇలియాస్ అక్బర్, తహసీన్ పాషా, నర్సింగ్‌రావు, ఆజామ్‌ఖాన్ తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి బజరంగ్ సేన కృషి



అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి బజరంగ్ సేన ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర బజరంగ్ సేన అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ పరిధిలో, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల పరిరక్షణకు బజరంగ్ సేన ముందుంటుందన్నారు. చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ఆలయాల పరిరక్షణకు బజరంగ్ సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల వద్ద పెద్ద ఎత్తున్న భద్రత చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు.

నియామకం



కృష్ణానాయక్

చాంద్రాయణగుట్ట: డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ) సభ్యుడిగా జంగమ్మెట్‌కు చెందిన బీజేపీ నాయకుడు కృష్ణా నాయక్ నియమితులయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చైర్మన్‌గా ముగ్గురు ఎంపీలు కో-చైర్మన్‌లుగా, 15 మంది ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉండే కమిటీలో ఎస్టీ కోటాలో కృష్ణానాయక్‌ను సభ్యుడిగా నియమించారు. తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన కిషన్ రెడ్డి, పార్టీ నాయకులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కొడీ మహేందర్, కల్యాణ్ నాయక్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం



గోల్కొండ: సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లి గడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్థాపిత దేవార్చన, పుణ్యావచనం, సంపాదత్య గ్రహణం, యంత్ర విగ్రహాలకు ఏకాశీతి, కలష స్థాపనం తదితర కార్యక్రమాలు చేశారు. ఉదయం 11 గంటలకు యంత్ర విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, శివ హోమం, మహా పూర్ణహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత శివలింగ ప్రతిష్ఠాపనకు ముందుకు వచ్చిన దాత సుంకరి శాలిని ప్రేమ్‌కిషన్‌ను అభినందించారు. చండీ ఉపాసకులు అభినందన్ దివిదేది ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.నర్సింహ, సోమారపు జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గన్‌ఫౌండ్రీ: ది జింజర్, గార్లిక్, పొటాటో మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు ఆదివారం సిద్దిఅంబర్ బజార్‌లోని ఓ హోటల్‌లో నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎం.నరేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా సురేష్ జార్జ్, కోశాధికారిగా డి.శశికాంత్, ఉపాధ్యక్షుడిగా డి.శివకుమార్ ఖలీం, జాయింట్ సెక్రెటరిగా గోపాల్‌యాదవ్, గౌరవ సలహాదారులుగా కె.రాధాకృష్ణ, ప్రవీణ్, సి.పరమేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా సైదా వలీ, బి.మల్లేష్, శేషాద్రి గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్‌గంజ్ ఎస్ఐ జగదీష్, బీజేవైఎం సెంట్రల్ జిల్లా కార్యదర్శి దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఫిర్యాదుల వెల్లువ



వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

శాలిబండ: మీరాలం సబ్ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు మీరాలం ఏడీఈ వెంకటేశ్ గౌడ్ తెలిపారు. నాలుగు ఫిర్యాదుల్లో.. మూడు విద్యుత్ అంతరాయాలు, ఒకటి మీటర్ అధిక బిల్లింగ్ వస్తుందని ఫిర్యాదులు అందాయన్నారు. అధిక బిల్లుకు సంబంధించిన బిల్లు సవరణకు ఈఆర్ఓ కార్యాలయానికి ప్రపోజల్ పంపించి వారంల్లోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ అంతరాయ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఏఈకి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చందులాల్ బారాదరి ఏఈ షబ్బీర్ అహ్మద్, అత్తాపూర్ ఏఈ సత్యనారాయణ, కిషన్‌బాగ్ ఇన్‌చార్జి ఏఈ శివ ప్రసాద్, మీరాలం సబ్ ఇంజనీర్ బుచ్చిరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



ఆర్షన్ (ఫైల్)

గౌలిపురా: బాలుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.కృష్ణకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేదర్వాజా ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖాజా పాషా తన కుమారుడు ఆర్షాన్ (3) కలిసి గత నెల 30న మొఘల్‌పురాలో నివాసముండే సోదరి ఇంటికి వచ్చారు. సాయంత్రం 7:30 గంటలకు కుమారుడికి బిస్కెట్లు ఇప్పించేందుకు నాగులచింత వద్దకు వెళ్లాడు. కాగా అక్కడ మద్యం షాపు కనిపించడంతో ఖాజా పాషా కుమారుడి పక్క కూర్చొబెట్టి మద్యం సేవిస్తున్నాడు. ఇంతలో కుమారుడు కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సదర్ సంబురాలు

గోల్కొండ: సదర్ ఉత్సవాలు జోరుగా కొనసాగుతున్నాయి. షేక్‌పేట్, గోల్కొండ, లంగర్‌హౌస్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో సదర్ వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా యాదవ సోదరులు దున్నరాజులను అందంగా అలంకరించి వాటితో విన్యాసాలు చేయించారు. గోల్కొండ మోతీదర్వాజ చౌరస్తా వద్ద గోల్కొండ యాదవ సంఘం అధ్యక్షుడు బద్రియాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు భారీగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో శ్రీశైలం యాదవ్, అన్నూ యాదవ్, రాంబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ ఉత్సవంలో దున్నరాజులతో బద్రియాదవ్ తదితరులు



వేడుకల్లో సంతోష్‌గుప్తా తదితరులు

ఘనంగా సదర్ వేడుకలు

అబిడ్స్: యాదవుల సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాంబాగ్, బషీర్‌బాగ్, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో జరిగిన సదర్ వేడుకల్లో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా పాల్గొన్నారు. ఆయనను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం సంతోష్‌గుప్తా మాట్లాడుతూ..సదర్ వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పండుగగా ప్రకటించడం ఎంతో అభినందనీయమన్నారు.